క్లుప్తంగా

సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దవూర : ఈనెల 16న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హోటల్ హబ్సిగూడలో రాష్ట్ర ఎస్సీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు నిర్వహించే ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని బట్టుగూడెంలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన గోడపోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదిమళ్ల సత్యనారాయణ, దండె కొండలు, ఆదిమళ్ల శేఖర్, రేపాక యల్లయ్య, యశోద, జానమ్మ, ఈదమ్మ, దేవి, కాశమ్మ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

15న దాశరథి శత జయంతి మహోత్సవం

రామగిరి(నల్లగొండ): తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సాహితీ మేఖల చండూరు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన రవీంద్రభారతిలో మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సాహితీ మేఖల సంస్థ ప్రధాన కార్యదర్శి పున్నమి అంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీ మేఖల సంస్థ అధ్యక్షుడు అంబటిపూడి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి కవులు, కళాకారులు హాజరుకావాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్‌: నల్లగొండ పట్టణంలోని గౌడ హాస్టల్‌లో ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్ సమక్షంలో జిల్లా గోపా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దంతురి సైదులుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నేలపట్ల శ్రీధర్‌గౌడ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా పంతంగి కరుణాకర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దంతూరి సైదులు గౌడ్, నకరికంటి శ్రీనయ్య గౌడ్, సిద్దగోని పరమేష్‌గౌడ్, చెక్కిళ్ల మధుసూదన్‌గౌడ్, మీనయ్య గౌడ్, జి వేణుబాబుగౌడ్, జాజుల లింగంగౌడ్, రాంబాబుగౌడ్, సోమశేఖర్‌గౌడ్, తండు కృష్ణ చైతన్య గౌడ్, దూసరి కిరణ్‌గౌడ్, నిమ్మల పిచ్చయ్యగౌడ్, శంకర్ గౌడ్, రేకుల గడ్డ నరసింహ గౌడ్, పంతంగి కరుణాకర్ గౌడ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి



మాట్లాడుతున్న నేలపట్ల చంద్రశేఖర్

నల్లగొండ టౌన్‌: బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చీఫ్ కోఆర్డినేటర్ నేలపట్ల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. స్థానిక సంస్థలే గాకుండా విద్యా, ఉద్యోగాల్లో కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల కోసం నిరంతరం పోరాడుతున్న ఎమ్మెల్సీ మల్లన్న కార్యాలయంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు నకిరేకంటి కాశయ్యగౌడ్, దొమ్మాటి అంజయ్య, ప్రజాపతి, చామల చంద్రశేఖర్, మామంచి అంజయ్య, కంచనపల్లి షణ్ముకాచారి, సిరసవాడ చంద్రం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్‌సీఎల్ వైద్యాధికారికి జాతీయ అవార్డు



శ్రీహరిరావుకు అవార్డు అందజేస్తున్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, తదితరులు

మఠంపల్లి : మండలంలోని ఎన్‌సీఎల్ పరిశ్రమ వైద్యాధికారి డాక్టర్ జల్లిపల్లి శ్రీహరిరావును ఆదివారం ఢిల్లీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్‌ప్లానర్స్ ఇండియా ప్రాంగణంలో డాక్టర్స్‌డేను పురస్కరించుకుని ఉత్తమ సేవలందిస్తున్నందుకు గాను కేంద్రమంత్రి జితేంద్రసింగ్ జాతీయస్థాయి ఉత్తమ సేవల అవార్డును ప్రదానం చేశారు. ఈ సదర్భంగా డాక్టర్ శ్రీహరిరావు స్థానికంగా మాట్లాడారు. వైద్యవృత్తిలో ఉండి గ్రామీణ పట్టణ ప్రాంతాలలో అనేక బ్లడ్ డొనేషన్ క్యాంపులు, మెడికల్ క్యాంపులు నిర్వహించి 1566బ్లడ్ బాటిల్స్ ప్రభుత్వ హాస్పిటల్స్‌కు, రెడ్ క్రాస్ సొసైటీకి అందించడంతో ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఢిల్లీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్‌గోయల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ దిలీప్‌బన్సాలీ, ఐఎంఏ ఎక్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్‌వీ అశోకన్ పాల్గొన్నట్లు తెలిపారు. శ్రీహరిరావుకు అవార్డు రావడంపై ఎన్‌సీఎల్ పరిశ్రమ ఉద్యోగులు అభినందించారు.

వన మహోత్సవం లక్ష్యం నెరవేరేనా!

- వర్షాలు కురిస్తేనే మొక్కలు నాటేది
- వలు నర్సరీల్లో ఎదగని మొక్కలు
- గ్రామాల వారీగా మొక్కల పెంపకం
- మండల లక్ష్యం 61620 మొక్కలు





నర్సరీలో ఎదుగుదల లేని మొక్కలు

పెద్దవూర : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం ఈ సీజన్‌లో ఇంకా ప్రారంభం కాలేదు. ప్రతి గ్రామంలో అనుకున్న లక్ష్యం ఏమో గాని, కనీస స్థాయిలోనైనా మొక్కలు నాటేలా కనిపించడం లేదు. వర్షాకాలం ప్రారంభమై నెలన్నర రోజులు గడుస్తున్నా ఇప్పటికీ మండలంలో సరైన వర్షం పడలేదు. దీంతో మండలంలో ఏ గ్రామంలోనూ వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం కాలేదు. వర్షాలు లేక చాలా గ్రామాల్లోని వన నర్సరీల్లో సగానికి పైగా ఆశించిన స్థాయిలో మొక్కల ఎదుగుదల లేదు. నెట్ షెడ్ వేయని చోట వేసవిని తలపిస్తున్న ఎండలకు మొక్కలు వాడుబట్టి ఎండిపోతున్నాయి. ఎప్పుడు వర్షం పడుతుందా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి మండలంలో నెలకొంది. మండల కేంద్రంలోని కేజీబీవీ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు 200 గుంతలు తీశారు. శుక్రవారం కేజీబీవీలో నూతనంగా నిర్మించిన కళాశాల భవన ప్రారంభానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మామిడి మొక్కను నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో ఎప్పుడు వర్షం పడితే అప్పుడు ఆయా గ్రామాల్లో మొక్కలు నాటడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. దిన దినం తరగిపోతున్న అడవులను 33శాతానికి పెంచి గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరియాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమం కింద విరివిగా మొక్కలు నాటింది. గత ఏడాది నుంచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారం పేరుమార్చి వనమహోత్సవం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది.

మండల లక్ష్యం 61620 మొక్కలు

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ఒక వన నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలకు గాను మొత్తం 57 ఆవాస గ్రామాలు ఉన్నాయి. 2025–26 సంవత్సరం వన మహోత్సవంలో భాగంగా మండలంలో మొత్తం 61620 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని వన నర్సరీల్లో పండ్లు, పూలు, నీడనిచ్చే 1,20,410 మొక్కలను పెంచుతున్నారు. ప్రధానంగా జామ, నిమ్మ, బొప్పాయి, మునగ, కరివేపాకు, కానుగ, సిల్వర్‌ఓక్, చింత, ఉసిరి, వేప, గుల్మోరు, చీమతంగెడు, చీమ చింత, కాగితపు పూలు, మందార, గోరింటాకు వంటి 15కు పైగా రకాల మొక్కలను పెంచుతున్నారు.

గ్రామాల వారీగా..

ఆయా గ్రామ పంచాయతీలతో పాటు ఆవాస గ్రామాల్లోనూ విరివిగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గ్రామ విస్తీర్ణం, జనాభాను బట్టి మొక్కలను పెంచాల్సి ఉంటుంది. ఈ మొక్కలను ప్రభుత్వ భూములు, అటవీ భూములు, సంఘం భవనాలు, రహదారికి ఇరువైపులా, పొలం, కాలువ గట్లపైన, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాలలో నాటించాలి. నాటిన మొక్కలలో 85 శాతం బతికేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటేందుకు గుంతలు తీయటానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

వర్షాల కోసం వేచి చూస్తున్నాం



వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గత జూన్ నెలలోనే ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటివరకు సరైన వర్షాలు పడలేదు. దీంతో మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించలేక పోయాం. వర్షాలు పడగానే వన మహోత్సం కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఒక్కో గ్రామంలో వెయ్యి నుంచి ఐదు వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఏది ఏమైనా మండల లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ఆయా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలతో గుంతలు తీయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–మానె ఉమాదేవి, ఎంపీడీఓ, పెద్దవూర

వైద్యశిబిరాల నిర్వహణ అభినందనీయం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ : నిరుపేదలైన సిక్కుల ఆరోగ్యం కోసం వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం మిర్యాలగూడలో తెలంగాణ సిక్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎస్‌పీఎఫ్ డీజీ తేజ్‌దీప్‌కౌర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. ఉమన్ డెవలప్‌మెంట్ హబ్ అభివృద్ధి కోసం రూ.5లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎస్‌పీఎఫ్ మాజీ డీజీ తేజ్‌దీప్‌కౌర్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖమ్మం, విజయవాడ, సూర్యాపేట, కోదాడ, నల్లగొండ, చిట్యాల తదితర ప్రాంతాల నుంచి వైద్యశిబిరానికి ప్రజలు వచ్చినట్లు తెలిపారు. సిక్కుల అభివృద్ధి కోసం కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మాజీ కౌన్సిలర్ అమృతం సత్యం, పరమేందర్‌సింగ్, మాన్‌సింగ్, దర్శన్‌సింగ్, ఇందర్‌సింగ్, కిరణ్, అజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణరావు ఆశయ సాధన కృషి చేయాలి



నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యాదగిరిరావు

చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు స్వాతంత్ర్య సమరయోధులు మాజీ శాసనసభ్యుడు ఉజ్జిని నారాయణరావు ఆశయ సాధనకు కృషిచేయాలి అని మునుగోడు మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. నారాయణరావు తొమ్మిదో వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజాకార్లకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహోన్నత నేత నారాయణరావు అన్నారు. మునుగోడు శాసనసభ్యుడిగా ప్రజలకు ఎనలేని సేవలను అందించాడని ఆయన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యుగంధర్ రావు, మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, అంజల్‌రావ్, రాములు ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీసు

చింతపల్లి : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని చింతపల్లి ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాల్ వీటీనగర్ హైదరాబాద్–నాగార్జున సాగర్ హైవేపై వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల తనిఖీ (స్పెషల్ డ్రైవ్)లో 11 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలను అప్పగించినా మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రమాదాల నివారణకు తాత్కాలిక చర్యలు



దయ్యాలగండి మూలమలుపు వద్ద బొల్లార్డ్స్ ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ జాతీయ మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారడంతో ఇటీవల సాక్షి దినపత్రిక ×ఆ దారిలో వెళ్తున్నారా.. జాగ్రత్త ।అనే కథనాన్ని ప్రచురించింది. సాక్షి కథనానికి స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులను వేర్వేరుగా తమ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రమాదాలు జరుగుతున్న ఈ ప్రాంతాల్లో తాత్కాలికంగా స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఆదివారం సీఐ శ్రీను నాయక్, ఎస్‌ఐ ముత్తయ్య పోలీస్ సిబ్బంది సంయుక్తంగా ఆయా ప్రాంతాల్లో ప్రమాదం జంక్షన్ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ సూచనలతో పాటు రాత్రి సమయంలో దృష్టికి వచ్చేలా కట్టడ మెప్పులను చేపట్టారు. దయ్యాల గండి మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేసి వన్ వే చేశారు. అలాగే అన్ని మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

42శాతం రిజర్వేషన్ల నిర్ణయం చరిత్రాత్మకం



కట్టెబోయిన అనిల్ కుమార్

హాలియా : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ ఆమోదం తెలపడం చరిత్రాత్మక నిర్ణయమని ఏకే ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం హాలియా పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కేబినెట్ ప్రస్తుతం తీసుకున్న నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు పెద్ద ఎత్తున మేలు కలుగుతుందన్నారు. రాజకీయంగా బీసీలు ముందడుగు వేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పనకు ఆమోదం తెలిపినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వేషన్ల అమలులో కోర్టులో ఏమైనా న్యాయపరమైన సమస్యలు ఎదురైతే ఎదుర్కొవడానికి అన్ని పార్టీలు సహకరించి బీసీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ నెల 21న జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి బీజేపీ ప్రభుత్వం బీసీలపై తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మాటూర్‌లో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఉద్యోగులు

త్రిపురారం : మండలంలోని మాటూర్ గ్రామానికి చెందిన తెలంగాణ దూంధాం కళాకారుడు కలకొండ శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆదివారం మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులు రూ. 50వేలు పోగు చేసి కలకొండ శ్రీను కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మృతుడు శ్రీను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మడుపు వెంకటేశ్వర్లు, కలకొండ శివ శంకర మల్లయ్య, పోతుగంటి యల్లయ్య, మడుపు అభిరాం, చంద్రయ్య, గన్నెపాక లక్ష్మయ్య, వడ్డె పెద్ద సైదులు, నల్లగుళ్ల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి హేయమైన చర్య

మిర్యాలగూడ టౌన్ : హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి హేయమైన చర్య అని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జాగృతి గుండాలు బీసీ ఎమ్మెల్సీ మల్లన్నపై దాడి చేయడాన్ని బీసీ సమాజం అంత ఖండించాలన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీ గన్‌మెన్‌లపై దాడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్న మల్లన్నపై ఆకారణంగా దాడికి పాల్పడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు దాసరాజు జయరాజ్, యుద్దం రాజు, భాస్కర్, గంగాధర్, అంజి గౌడ్, ఉపేందర్, సుదర్శన్ తదితరులున్నారు.

మల్లన్నపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఎమ్మెల్సీ తీనార్మర్ మల్లన్నపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తీన్మార్ మల్లన్నతో పాటు ఆయన గన్‌మెన్‌లు, మీడియా కార్యాలయంపై దాడికి పాల్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయ నాయకుల ముసుగులో దాడికి పాల్పడం సరైంది కాదన్నారు. నిరసన ప్రజా స్వామ్యబద్ధంగా ఉండాలి కానీ దాడులకు పాల్పడటం నీచ రాజకీయం అన్నారు. అందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షిం చడంతో పాటు మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.

పెయింటింగ్ కార్మికుల కూలి పెంచాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెయింటింగ్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య కోరారు. నల్లగొండలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 1 నాటికి నూతన రేట్లు నిర్ణయించి అమలు చేసుకోవాలన్నారు. భీమనపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఐటీయూ టౌన్ కన్వీనర్ అవుట రవీందర్, యూనియన్ గౌరవ సలహాదారు కత్తుల జగన్, కార్యదర్శి దుప్పలపల్లి శంకర్, కోశాధికారి బైరు నరసింహ, ఉపాధ్యక్షుడు బుషిపాక యాదగిరి, సహాయ కార్యదర్శి ఎస్.కె.జాని, ప్రచార కార్యదర్శి ఆకారం చరణ్ , సభ్యులు కత్తుల వెంకన్న, జంజరాల శేఖర్, జంగాల యాదగిరి, గాదరి నాగరాజు, కాశీమల్ల విజయ్, ఎడ్ల రాములు, జాకటి సతీష్, కత్తుల రాములు, పిట్టల శివ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి



గంజా రాపిడ్ యూరిన్ కిట్

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో గంజాయి నిర్మూలనకు కృషిచేస్తున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని కొంతమంది పాత నేరస్తులకు గంజాయి నిర్ధారణ కిట్ ద్వారా పరీక్ష జరిపినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి తాగినట్లుగా అనుమానం వస్తే వారికి యూరిన్ కిట్ ద్వారా అక్కడికక్కడే గంజాయి తాగినారా? లేదా? అని టీఎస్ న్యాబ్ వారి పరకరాల ద్వారా నిజ నిర్ధారణ పరీక్ష చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గంజాయి యూరిన్ కిట్ (గంజా రాపిడ్ యూరిన్ కిట్)లో 12 రకాల పరీక్షలు నిర్ధారణ చేయవచ్చన్నారు. మత్తు కలిగించే పదార్థాలను తీసుకుంటే ఈ పరీక్ష ద్వారా వారిని గుర్తించవచ్చన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణం

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలంకరణ గావించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అంతేగాక శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు ఉన్నారు.

పాఠశాలల మూసివేత

- తిరుమలగిరి(సాగర్) మండలంలో తెరుచుకోని 11స్కూళ్లు
- అదే బాటలో మరికొన్ని బడులు
- ఆందోళనలో ఉపాధ్యాయులు



మూసివేసిన నెల్లికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలో విధ్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూసివేసుతన్నారు. మండలంలో మొత్తం 50 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, 41 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటికే నెల్లికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండేళ్ల క్రితమే మూసివేశారు. రాజవరం, నేతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కనీసం యాభై మంది విద్యార్థులు కూడా లేని పరిస్థితి. ఒక్క తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే రెండు వందల యాభై మందికి పైగా ఉన్నారు. యూపీఎస్ పాఠశాలలో ఈ ఏడాది గోడుమడక పాఠశాల మూతబడగా మిగతా నాలుగు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బాగానే ఉన్నప్పటికీ పీఎస్‌లలో విద్యార్థుల సంఖ్య ఘోరంగా ఉంది. చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పది కంటే కూడా తక్కువగా ఉంది.


5పాఠశాలలు పునఃప్రారంభం

ఈ ఏడాది మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 11పాఠశాలలు పూర్తిగా మూసివేశారు. గతేడాది మూతబడిన పాఠశాలల్లో ఈ ఏడాది ఐదు పాఠశాలను తిరిగి పునఃప్రారంభించారు. అయినప్పటికీ పాఠశాలలకు విద్యార్థులు వచ్చే పరిస్థితి కనబడటం లేదు. విద్యార్థుల సంఖ్య పెరిగనట్లయితే పునఃప్రారంభైన పాఠశాలలు మరలా మూతబడే పరిస్థితులు ఉన్నాయి. అక్కడ ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపిస్తారు. దీంతో మూసివేయనున్న పాఠశాల ల సంఖ్య కూడా పెరిగే అవకాశాలు లేకపోలే దు. ఒక్కసారి పాఠశాలను మూసివేసినట్లయి తే తి రిగి తెచ్చుకోవడం కష్టమని పలువురు ప్రజాప్రతి నిధులు గ్రామస్తులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతున్నా వారిలో మార్పు కనపించడం లేదు

ఈ ఏడాది 198 అడ్మిషన్లు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుండటంతో, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఆచార్య జయశంకర్ సార్ పేరుతో బడిబాట కార్యక్రమాన్ని చేపడుతుంది. అందులో భాగంగా ఈ ఏడాది చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా 198మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అసలే ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితులు కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయి. విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాల్సిన ఉపాధ్యాయులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాఠశాలలను కాపాడుకుందాం



తల్లిదండ్రులు మీ పిల్లలను స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలి. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. గతేడాది మూతబడిన పాఠశాలలను ఈ ఏడాది తిరిగి పునఃప్రారంభించాం. ఆ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ తీవ్రంగా శ్రమిస్తుంది. విద్యార్థుల సంఖ్య ఐదు కంటే తక్కువ ఉంటే ఆ పాఠశాలలు తిరిగి మూతబడే అవకాశం ఉంది. కాబట్టి ఆ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

- కొనమంచిలి శ్రీనివాస్, ఎంఈఓ

బ్రిడ్జి పనులు పూర్తయ్యేదెన్నడో..

- రెండు ప్యాకేజీలుగా నిర్మాణం
- పూర్తి కానున్న మొదటి ప్యాకేజీ పనులు
- టెండర్ దశలోనే రెండో ప్యాకేజీ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు



బ్రిడ్జి శిలాఫలకం..



కొనసాగుతున్న మొదటి ప్యాకేజీ పనులు

నిడమనూరు : ఊట్కూరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను రెండు దశల్లో చేపట్టగా.. మొదటి దశ పనులు పూర్తికావొస్తున్నాయి. కానీ రెండో దశ పనులు మాత్రం ఇంకా టెండర్ దశలోనే ఉన్నాయి. మొదటి ప్యాకేజీ రూ.3.75కోట్లతో అప్పటి ఎమ్మెల్యే నోముల భగత్ సెప్టెంబర్ 29, 2023లో చేపట్టారు. ఏడాదిన్నరగా మొదటి పనులు మాత్రం నడుస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఉన్న లో లెవల్ వంతెనతో గతంలో వాహనదారులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వార్షాకాలంతో తీవ్ర ఇబ్బందులు

మారుపాక, వెంకటాపురం, నందికొండవారిగూడెం శివారులోని కుంటలకు, చెరువులకు లింకు కేనాల్‌గా ఊట్కూరు వాగు ఉంటుంది. వర్షాకాలంలో వాగు ఉధృతి ఎక్కువగా ఉండి లో లెవల్ వంతెనపై నుంచి వరద ప్రవాహం వెళ్తుంది. దీంతో ఊట్కూరు, నందికొండ వారిగూడెం గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యేది. ఈ పరిస్థితి అనాటి ఎమ్మెల్యే నోముల భగత్ దృష్టికి తీసుకెళ్లగా అప్పట్లో అసెంబ్లీ ఎన్నికల ముందు హడావుడిగా హై లెవల్ బ్రిడ్జిని రెండు ప్యాకేజీలుగా మంజూరు చేశారు. ప్రభుత్వాలు మారడంతో ఏడాదిన్నరాగా పనులు సాగలేదు. ఈ విషయంపై మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకురాగా, మొదటి ప్యాకేజీ నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టేలా కృషి చేశారు. ప్రస్తుతం మూడు నెలల నుంచి మొదటి ప్యాకేజీ పనులు చేపట్టారు. ప్రస్తుం పిల్లర్ల పనులు చేపడుతాన్నారు. రెండు, మూడు నెలల్లో పిల్లర్ల పనులు పూర్తికానున్నాయి.

రెండు దశ పనులు ఎప్పుడో..

ఇప్పటి వరకు కూడా రెండో ప్యాకేజీ పనులు టెండరు ప్రకియ ప్రారంభంకాకపోవడంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంపై స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. రెండో ప్యాకేజీలో ప్రధానంగా రూ.2.1 కోట్లతో పిల్లర్లపై స్లాబ్ నిర్మాణం చేపట్టి వంతెన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు దృష్టిసారించి రెండో ప్యాకేజీ పనుల టెండరు చేపట్టి, త్వరితగతిన ఊట్కూరు బ్రిడ్జి పూర్తిచేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.